మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త



## పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన మెదక్ జిల్లా ఎస్పీ



పోలింగ్ బూతును పరిశీలిస్తున్న ఉదయ్ కుమార్‌రెడ్డి

**శివ్వంపేట, ఫిబ్రవరి 18 (ప్రభాతవార్త) :** ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా మండలకేంద్రం లోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్‌బూతులను జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి పరిశీలించారు. ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సంబంధించిన ఏర్పాట్లు ఇలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం పోలీస్‌స్టేషను పరిశీలించి కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోలీస్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ శ్రీ రంగాకృష్ణ, ఎస్సై మధుకర్ రెడ్డి, పోలీస్ సిబ్బంది, పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటిన క్రీడాకారులు

**గజ్వేల్ టౌన్, ఫిబ్రవరి 18 (ప్రభాతవార్త):** హైదరాబాద్ సరూర్‌నగర్ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన 8వ రాష్ట్రస్థాయి తైక్వాండో ఛాంపియన్‌షిప్ పోటీల్లో గజ్వేల్ క్రీడాకారులు పతకాల పంట పండించారు. అందులో ఒకటి గోల్డ్‌మెడల్, ఒకటి సిల్వర్ మెడల్, ఎనిమిది బ్రోంజ్ మెడల్ పతకాలు సాధించారని జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాంమోహన్‌రెడ్డి, మాస్టర్ స్వామిలు తెలిపారు. గోల్డ్‌మెడల్ సాధించిన తోట శాన్వి, సిల్వర్ మెడల్ సాధించిన తోట శ్రీహర్ష, బ్రోంజ్ మెడల్ సాధించిన ద్యుతిరెడ్డి, యువన్‌రెడ్డి, హనియా, తన్వి, హేమచంద్రలను ఈ సందర్భంగా అభినందించారు.



తైక్వాండో పోటీల్లో సత్తా చాటిన క్రీడాకారులు



బాలికల విద్యాలయాన్ని పరిశీలిస్తున్న గరిమాఅగర్వాల్

## విద్యార్థులు చదువుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలి

### కలెక్టర్ గరిమా అగర్వాల్

**కోహెడ, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త :** మండల పరిధిలోని తంగళ్లపల్లి గ్రామంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని మంగళవారం జిల్లా అడిషనల్ కలెక్టర్ గరిమా అగర్వాల్ సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. పాఠశాల పరిశుభ్రత, టాయిలెట్స్ నిర్వహణ, వంటసామగ్రి నిలువ, తరగతి గదుల నిర్వహణ, భోజన వసతుల ఏర్పాటు విద్యార్థుల ఆరోగ్యం, నీటి సరఫరా వాటర్ శుద్దీకరణ తదితర అంశాలపై సమీక్షించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యంకలగకుండా చేసుకోవాలని వివిధశాఖల అధికారులకు సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్యశాఖ సిబ్బంది ఎప్పటికప్పుడు విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని పరీక్షించాలన్నారు. విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఎంచుకొని మంచిగా చదువుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. సమస్యలను త్వరగా పరిష్కరించడానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఆమె వెంట డిఈవో శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ సురేఖ, మండల విద్యాధికారి పద్మయ్య, ఎంపివో శోభ, మండల ప్రత్యేక అధికారి ప్రవీణ్, వైద్యాధికారి నిర్మా, సిడిపిఓ జయమ్మ, ఐసిడిసి సూపర్ వైజరు

## బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలి

### -అంగన్‌వాడి టీచర్లకు జిల్లా అధికారి హైమవతి సూచన



మాట్లాడుతున్న హైమవతి

**అల్లాదుర్గం, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:** అంగన్‌వాడి టీచర్లు విధి నిర్వహణను బాధ్యతాయుతంగా నిర్వహించాలని మెదక్ జిల్లా సంక్షేమ శాఖ అధికారి హైమవతి సూచించారు. మంగళవారం మండల కేంద్రమైన అల్లాదుర్గంలో అంగన్‌వాడి టీచర్లతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా హైమవతి మాట్లాడుతూ పిల్లలకు ప్రీ స్కూల్ కార్యక్రమాలు ప్రణాళిక ప్రకారం నిర్వహించాలని, ఆన్‌లైన్ రిపోర్టులు ఎప్పటికి అప్పుడు పూర్తి చేయాలని, గ్రామాల్లో బాల్య వివాహాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మేనరికం వివాహాలతో కలిగే అంగవైకల్యం ఏర్పడే అవకాశాలు ఉంటాయన్నారు. పోషణ ట్రాకర్ ఆన్‌లైన్ అప్లికేషన్‌లో టిహెచ్ఆర్ పిల్లల తల్లిదండ్రుల ఫోటో కాప్చర్‌ను 100 శాతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సిడిపిఓ పద్మలత, డిహెచ్ఈడబ్ల్యూ సంతోషి, ప్రాజెక్టులోని సూపర్‌వైజర్లుఉ పోషణ్ అభియాన్ సిబ్బంది, అంగన్‌వాడి టీచర్లు పాల్గొన్నారు.

## రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

### జూనియర్ సివిల్ జడ్జ్ కృష్ణతేజ





మాట్లాడుతున్న కృష్ణతేజ

**హుస్నాబాద్ రూరల్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త :** ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు వైద్యులు మెరుగైన సేవలు అందించాలని జూనియర్ సివిల్ జడ్జ్ కృష్ణతేజ అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం(కమ్యూనిటీ హెల్త్ సెంటర్)లో ఆసుపత్రి వైద్యులతో కలసి న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రికి వచ్చిన రోగులు ఏసమస్యలపై వచ్చారు. ఆసుపత్రిలో వారికి అందిస్తున్న చికిత్సలను గురించి వైద్యులను అడిగి తెలుసుకోవడంతో పాటు రోగులకు వైద్యులు అందిస్తున్న సేవలు ఎలా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో అడ్మిట్ అయి చికిత్స పొందుతున్న రోగులకు పండ్లను పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చేది నిరుపేద కుటుంబాలకు చెందిన వారు అని వారి ఆరోగ్యం పట్ల వైద్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ వచ్చే రోగులకు భరోసా కల్పించాలన్నారు. వైద్యులు విధినిర్వహణలో ఆలసత్వం వహించవద్దని, వచ్చిన రోగుల పట్ల మర్యాదగా వ్యవహరించడంతో పాటు వారికి మనోధైర్యాన్ని ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు డాక్టర్ రమాదేవి, జయాంత్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## స్కిల్ డెవలప్‌మెంట్ వర్సిటీకి భూమిని గుర్తించండి

### -అధికారులకు జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశం

**పాపన్నపేట, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:** జిల్లాలో స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ నిర్మాణానికి భూమిని గుర్తించే ప్రక్రియ వేగవంతం చేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం మండలంలో కలెక్టర్ విస్తృతంగా పర్యటించారు. స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ నిర్మాణానికి భూమికి సంబంధించి వివిధ ప్రదేశాలను ఆయా శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యూనివర్సిటీ నిర్మాణానికి అవసరమైన 10 నుంచి 15 ఎకరాల భూమిని గుర్తించేందుకు మండలంలోని తుమ్మాయిపల్లిలో, పాపన్నపేటలో భూములను పరిశీలించామన్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఓ రమాదేవి, ఇన్‌చార్జితహసీల్దార్ మహేందర్‌గౌడ్, రెవిన్యూ సిబ్బంది ఉన్నారు.



అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

# తాగునీటి సమస్య రాకుండా చర్యలు

### వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ మనుచౌదరి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

జిల్లాలో వ్యవసాయ రంగానికి, తాగునీటికి, నిర్మాణ రంగానికి విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి తెలిపారు. రానున్న వేసవి కాలంలో నీటి ఎద్దడి సమస్య తలెత్తకుండా కార్యచరణ రూపొందించాలని మంగళవారం హైదారాబాద్ నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లాలో విద్యుత్ వినియోగంపై అధికారులతో సమీక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. రైతు భరోసా పథకం కింద అర్హులైన అందరికీ పథకం అందేలా ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. రేషన్ కార్డులు కోసం ప్రజా పాలనలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు సమన్వయంతో క్షేత్రస్థాయిలో పరిశీలన ప్రక్రియ పూర్తి చేసి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రవర్తన నియమావళి ముగిసిన వెంటనే అర్హులకు కార్డులు అందించేలా చర్యలు చేపట్టామని వివరించారు. జిల్లాలో ప్రస్తుత వేసవి కాలంలో ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా మారుమూల ప్రాంతాలకు నీటిని అందించేందుకు అధికారులు సమన్వయంతో కార్యచరణ రూపొందించారని తెలిపారు. కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్లు గరిమాఅగర్వాల్, అబ్దుల్ హమీద్, పౌర సరఫరాలశాఖ జిల్లా అధికారి తనుజా, ఆర్డీఓలు సదానందం, రామ్మూర్తి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ శ్రీనివాసచారి, వ్యవసాయ అధికారి రాధిక, విద్యుత్, ఇరిగేషన్, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.





వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ మను చౌదరి



మాట్లాడుతున్న ఎసిపి మధు

### ప్రజలను నేరుగా కలిసి సమస్యలు తెలుసుకోవడమే

## కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం ఉద్దేశం

### సిద్దిపేట ఎసిపి మధు

**చిన్నకోడూరు, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:** ప్రజల రక్షణ, సెన్సాఫ్ సెక్యూరిటీ భద్రతాభావం కలిగించడానికే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించడం జరుగుతుందని సిద్దిపేట ఏసీపీ మధు అన్నారు. మండల పరిధిలోని ఇబ్రహీంనగర్‌లో మంగళవారం సాయంత్రం సీపీ డాక్టర్ అనురాధ ఆదేశాల మేరకు కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించి నార్కటిక్స్ డాగ్స్ అనుమానాస్పద ప్రాంతాలలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలను నేరుగా కలిసి వారి సమస్యలు తెలుసుకోవడమే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం ముఖ్య ఉద్దేశమన్నారు. గంజాయి ఇతర మత్తు పదార్థాలు, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. మహిళల రక్షణకు చట్టాలు పెద్దపీట వేస్తున్నాయని నూతన చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. గ్రామంలో ఎవరైనా గంజాయి ఇతర మత్తు పదార్థాలు కలిగి ఉన్న రవాణా చేసిన అమ్మిన వెంటనే డయల్ 100 కు కాల్‌చేసి సమాచారం అందించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. సైబర్ నేరం జరిగితే వెంటనే 1930కి లేదా 100కు కాల్ చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ వాహనాలకు సంబంధించి కాగితాలను, లైసెన్స్, బీమా సౌకర్యాన్ని కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భంగా ఎలాంటి కాగితాలు లేని 32 సైకిల్ మోటార్లు, ఆటో సీజ్ చేయడంతోపాటు రెండు బెల్టుషాపులపై దాడిచేసి 16 లీటర్ల లిక్కర్ స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో సిద్దిపేట రూరల్, దుబ్బాక సిఐలు శ్రీను, శ్రీనివాస్, చిన్నకోడూరు, భూంపల్లి, మిరుదొడ్డి ఎస్ఐలు బాలకృష్ణ, హరీష్, పరశురామ్, పోలీసు, డాగ్స్ స్క్వాడ్ సిబ్బంది పాల్గొన్నారు.

## బిజెపి ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలి

### -మండల పార్టీ అధ్యక్షుడు బాల్‌రెడ్డి

**వర్గల్, ఫిబ్రవరి 18 (ప్రభాతవార్త):** భారతీయ జనతా పార్టీ బలపర్చిన ఎమ్మెల్సీ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని వర్గల్ మండల బిజెపి పార్టీ అధ్యక్షుడు టేకులపల్లి బాల్‌రెడ్డి కోరారు. ఎమ్మెల్సీ అభ్యర్థులు అంజిరెడ్డి, కొమురయ్యలకు మద్దతుగా మంగళవారం మండల పరిధిలోని మజీద్‌పల్లి, నాచారం, అనంతగిరిపల్లి, వేలూరు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి పంపరి రమేష్, వెంకట్‌గౌడ్, ఉపాధ్యక్షులు శంకర్‌గౌడ్, బిజెవైఎం జిల్లా కార్యదర్శి రవీందర్‌గౌడ్, బూత్ అధ్యక్షులు శ్రీనివాస్, తిరుపతిరెడ్డి, వేలూరి జగన్, మహేష్ పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేస్తున్న బిజెపి నాయకులు



మాట్లాడుతున్న డీఈఓ రాధాకిషన్

## కుర్తివాడలో పాఠశాలను పరిశీలించిన డిఇఓ

**పాపన్నపేట, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:** మండల పరిధిలోని కుర్తివాడ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి రాధా కిషన్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని 6వ తరగతి గదిలోకి చేరుకుని విద్యార్థులతో పాఠాలు చదివించారు. 10వ తరగతిలో ప్రాక్టీస్ పరీక్షలు ఎలా రాస్తున్నారో పరిశీలించారు. ఉత్తమ ఫలితాలు సాధించేందుకు విద్యార్థులు క్రమ శిక్షణతో ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల, విద్యార్థుల రిజిస్టార్‌లను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం అందిస్తున్న తీరుపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. డిఈఓ వెంట ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, ఉన్నారు.

## బాల్యవివాహాలను అరికట్టాలి : లలితకుమారి



మాట్లాడుతున్న జిల్లా మహిళా సంక్షేమ అధికారి లలిత కుమారి

**జహీరాబాద్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:** అంగన్‌వాడి ప్రాజెక్టు ఆధ్వర్యంలో మహిళా శిశు సంరక్షణ బాల్య వివాహాలను అరికట్టేందుకు తగు చర్యలు తీసుకోవాని జిల్లా మహిళా సంక్షేమ అధికారి లలిత కుమారి సూచించారు. మంగళవారం పట్టణంలో బాల్యవిహాలను అరికట్టుటపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన లలిత కుమారి మాట్లాడుతూ 2006 యాక్ట్ ప్రకారం బాల్యవిహాలను అరికట్టుట ఆడిపిల్ల భద్రత, మహిళ సంరక్షణ తదితర అంశాలపై అంగన్‌వాడి టీచర్లకు పలు సూచనలు చేశారు. బాలల హక్కుల సంరక్షణ మాతా శిశు మరణాల రేటు తగ్గించడమ లక్ష్యంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. మహిళలకు హెల్ప్‌లైన్ నంబర్లను వివరించారు. కార్యక్రమలో సిపిడిఓ టి అంజమ్మ, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడి టీచర్లు పాల్గొన్నారు.

## నాచగిరి క్షేత్రంలో విశేష పూజలు

**వర్గల్, ఫిబ్రవరి 18 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని నాచగిరి శ్రీలక్ష్మీ నృసింహ్మాస్వామి క్షేత్రంలో స్వామివారి జన్మ నక్షత్రంను పురస్కరించుకొని మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అలంకరణతోపాటు పూజలు నిర్వహించగా అర్చకులు స్వాతి నక్షత్ర హోమాన్ని వేద మంత్రోశ్చరణల మధ్య వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులతో పాటు ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా ఎల్లమ్మతల్లి కళ్యాణం

**చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:** మండల పరిధి గజ్జలపల్లిలో ఎల్లమ్మతల్లి దేవాలయ వార్షికోత్సవాన్ని గౌడ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎల్లమ్మతల్లి తల్లికి కళ్యాణోత్సవం నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులను చెల్లించుకున్నారు.

# డంపింగ్‌యార్డ్ నిలిపివేసేవరకు ఆందోళన కొనసాగిస్తాం

### సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యవర్గ దర్శి చుక్క రాములు

**గుమ్మడిదల, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:**

డంపింగ్ యార్డ్ ఏర్పాటు నిలిచిపోయేవరకు సిపిఐ (ఎం) అన్ని ప్రజా సంఘాల మద్ధతుతో జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో నిరసన నిరవధిక సమ్మెలు కొనసాగించాలని ఆ పార్టీ కార్యవర్గ దర్శి చుక్క రాములు సూచించారు. గుమ్మడిదల, నల్లవల్లి, ప్యారానగర్‌లలో డంపింగ్ యార్డ్ నిలుపుదల కోసం చేస్తున్న పోరాటం జిల్లా, రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టిస్తుందని, న్యాయమైన పోరాటానికి వెంటనే రాష్ట్ర ప్రభుత్వం మండల పరిధిలోని రైతాంగాన్ని దృష్టిలో పెట్టుకొని డంపింగ్ యార్డ్ విషయంలో పునరాలోచనచేసి ఈ ప్రాంతం నుండి ఎత్తివేసే దిశగా చర్యలు చేపట్టాలని సీపీఐ (ఎం) పార్టీ సభ్యులు డిమాండ్ చేశారు. గుమ్మడిదల గ్రామంలో బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో నిరవధిక సమ్మె మంగళవారం చేపట్టారు. సమ్మెకు సీపీఐ (ఎం) పార్టీ రాష్ట్ర నాయకులతో పాటు మండల రాజకీయ పార్టీల జేఏసీ సంపూర్ణ మద్దతును ప్రకటించారు. నల్లవల్లిలో ప్రతి కుటుంబ సభ్యులు పనులు వదులుకొని డంపింగ్ యార్డ్ ఏర్పాటు ప్రభుత్వం విరమించుకునేంత వరకు పోరాటం ఆపేది లేదంటూ రోజూ వినూత్నమైన రీతిలో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తూ నిరవధిక సమ్మెను కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా వివిధ రైతు సంఘాల నాయకులు మాట్లాడుతూ పచ్చని అటవీ ప్రాంతంలో పిచ్చుకలు, కాకులు, గద్దలు సంచరించి ఎయిర్‌ఫోర్స్ ఎయిర్ ఫ్లయింగ్‌కు ఆటంకం కలిగే ప్రమాదం ఉందని పచ్చటి పల్లె వాతావరణం, నీరు కలుషితం, వాతావరణం కలుషితంతో వ్యవసాయ పంటలు పండక ఇబ్బందులు పడే ప్రమాదం ఉందని, వ్యవసాయ రైతుల జీవనోపాధి కోల్పోయే ప్రమాదం ఉందని రాష్ట్ర ప్రభుత్వ సంబంధిత శాఖ అధికారులు గమనించి వెంటనే సమాలోచన చేసి డంపింగ్‌యార్డ్‌ను ఎత్తివేసే దిశగా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం జేఏసీ సభ్యులు శంకర్ శర్మ, రామశర్మ, కిరణ్ కుమార్‌శర్మ, రవీందర్రావు కులకర్ణి, చైతన్య, కిషన్‌రావు, రాఘవేంద్రరావు, ప్రసాద్‌శర్మ, రామ శర్మ, మాధవి కులకర్ణి, లక్ష్మీ, సంతోషి, నర్మద, రంగనాయకి, అన్నపూర్ణ, నరసింహచార్యులు, పాపాచార్యులు, పార్టీల నుండి రాజయ్య, నరసింహా రెడ్డి, నాగేశ్వరరావు, చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, మద్ది విజయ భాస్కర్ రెడ్డి, తాజా మాజీ జెడ్పీటీసీ కుమార్ గౌడ్, చిమ్ముల దేవేందర్ రెడ్డి, జైపాల్ రెడ్డి, సిమ్ముల నరసింహారెడ్డి, మండల జేఏసీ కమిటీ సభ్యులు, వివిధ గ్రామాల ప్రజలు, మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



నిరవధిక సమ్మెలో పాల్గొన్న మహిళలు



మాట్లాడుతున్న ఎంపి కొండ విశ్వేశ్వర్‌రెడ్డి

## రాష్ట్రంలో కాంగ్రెస్, బిఆర్ఎస్‌పై ప్రజల్లో నమ్మకం పోయింది : ఎంపి కొండ విశ్వేశ్వర్‌రెడ్డి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

ఒక సిద్ధాంతం ఉన్నా పార్టీ ఎదైనా ఉంది అంటే అది కేవలం బిజెపి పార్టీయేనని చేవెళ్ల ఎంపి ఎంపి కొండ విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇతర పార్టీలకు సిద్ధాంతం అంటే తెలియదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బిఆర్ఎస్‌పై ప్రజల్లో నమ్మకం పోయిందన్నారు. మోదీ నాయకత్వంలో దేశానికి అంతర్జాతీయస్థాయిలో మంచి గుర్తింపు వచ్చిందన్నారు. ఇటీవల పార్లమెంటులో కేంద్ర సర్కారు ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పేదలకు పెద్ద పీట వేసిందని గుర్తు చేశారు. 5 యేండ్లలో 70 వేల మెడికల్ సీట్లు పెంచారని తెలిపారు. కేంద్ర సర్కారు తెలంగాణకు ఏమి చేయలేదని మాట్లాడం సరికాదని తెలంగాణ కేంద్ర సర్కారు సముచిత స్థానం కల్పిస్తుందన్నారు. ప్రతి రైతు కుటుంబానికి రూ.66 వేలు అందిస్తుందన్నారు. రాజ్యాంగాన్ని 50 సార్లు సవరణ చేసిన వారు రాజ్యాంగం పై మాట్లాడం విడ్డూరంగా ఉందన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు రత్నం, వంగ రామచంద్రారెడ్డి, దూది శ్రీకాంత్‌రెడ్డి, బైరి శంకర్ ముదిరాజ్, సొప్పదండి విద్యాసాగర్, తోడుపునూరి వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

## కాశీలో ఎనకపల్లి వాసి మృతి

**నాగల్‌గిద్ద, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త :** మండల పరిధిలోని ఎనకపల్లి గ్రామానికి చెందిన రామ్‌రెడ్డి ఈ నెల 13న ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో కొనసాగుతున్న మహాకుంభమేళాల్లో పుణ్యస్నానాలు ఆచరించి కాశీలోని కాశీ విశ్వనాథుడిని దర్శించుకుని రాత్రికి విశ్రాంతి తీసుకుంటున్న తరుణంలో మంగళవారం నిద్రిలోనే రామ్‌రెడ్డి మృతిచెందినట్లు గ్రామస్థులు పేర్కొన్నారు. రామ్‌రెడ్డి వారణాసిలో మృతి చెందినట్లు తెలుసుకున్న గ్రామస్థులు సంతాపం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు సానుభూతి ప్రకటించారు.

## అల్లుడితో కలిసి భర్తను చంపిన భార్య

**పాపన్నపేట, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:** అల్లుడితో కలిసి భర్తను భార్య గొంతు నులిమి చంపేసిన సంఘటన మండల పరిధిలోని బాచారంలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్థుల, పోలీసుల కథనం ప్రకారం... బాచారం గ్రామానికి చెందిన కరోల్ల ఆశయ్య(50) వ్యవసాయ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కాగా పక్షం రోజుల క్రితం వ్యవసాయ పొలం వద్ద కాలు జారిపడటంతో నడుము, తుంటి విరగడంతో లేవలేని పరిస్థితి ఏర్పడింది. అవటితనంలో అవస్థలు పడుతున్న భర్తకు సేవలు చేసే ఓపిక, సహనం లేక ఇల్లరికం వచ్చిన అల్లుడు రమేష్‌తో కలిసి ఆదివారం రాత్రి గొంతుకు టవల్ బిగించి హతమార్చిందన్నారు. భర్త సహజంగా మృతి చెందినట్లు నమ్మించే యత్నం చేయగా గ్రామస్థులు మృతుడి గొంతు వద్ద గల వాపును గమనించి భార్య, అల్లుడిని నిలదీయగా సేవ చేసే ఓపిక లేక రైతు బంధు సొమ్ము వస్తుందని ఆశించి హత్య చేసినట్లు ఒప్పుకున్నారన్నారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ సంఘటన స్థలానికి చేరుకుని మృతుడి భార్య, అల్లుడిని అదుపులోకి తీసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ వివరించారు.

## భార్య పుట్టింటికి వెళ్లిందని యువకుడి ఆత్మహత్య

**పాపన్నపేట, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:** భార్య పుట్టింటికి వెళ్లిందని కలత చెంది మద్యానికి బానిసైన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని నార్సింగి గ్రామంలో జరిగింది. ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ కథనం ప్రకారం... మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన సంజవ్‌కుమార్(25) ఉపాధి నిమిత్తం కామారెడ్డి జిల్లాలో గప్‌చుప్ బండిని నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్న క్రమంలో శ్రీలతను పెళ్లి చేసుకున్నారన్నాడు. కొంత కాలం ఇరువురు సంసారం బాగా సాగింది. సంజీవ్‌కుమార్ మద్యానికి బానిక కావడంతో మానేయాలని భార్య నచ్చచెప్పినా వినకపోతుండటంతో శ్రీలత పుట్టింటికి వెళ్లిపోయిందన్నారు. భార్య పుట్టింటికి వెళ్లిపోవడంతో జీవతంపై విరక్తి చెంది సంజీవ్ కుమార్ అద్దె ఇంట్లో సోమవారం రాత్రికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ జిల్లా ఆసుపత్రికి తరలించి భార్య శ్రీలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ వివరించారు.

## హత్యకు గురైన అదృశ్యమైన మహిళ

### వివాహేతర సంబంధమే కారణం

**సంగారెడ్డి బ్యూరో, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త :** అదృశ్యమైన మహిళ హత్యకు గురైంది. ఈఘటన చిన్నశంకరంపేట మండలం కొండాపూర్ అటవీ ప్రాంతంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు... మెదక్ పట్టణం ఫతేనగర్‌కు చెందిన మంగలి రేణుక(45) ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో స్వీపర్‌గా పని చేస్తుంది. ఈనెల 8న కనిపించకపోవడంతో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఆమె కొడుకు మంగలి శ్రీనాథ్ ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. మహిళ ఫోన్‌లిస్టు విచారించగా చిన్నశంకరంపేట మండలం కొండా పూర్‌కు చెందిన బత్తుల ఏసుతో పరిచయం ఉన్నట్లు గుర్తించారు. ఏసుని విచారించగా రేణుకను తానే హత్య చేసినట్లు అంగీకరించినట్లు చెప్పారు. కొండాపూర్ అటవీ ప్రాంతంలో హత్యచేసి, పెట్రోల్ పోసి తగలపెట్టినట్లు పోలీసులు గుర్తించారు. ఇద్దరి మధ్య వివాహేతర సంబంధమే హత్యకు కారణంగా పోలీసులు గుర్తించారు. మృతురాలి భర్త నర్సింలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ నాగరాజు తెలిపారు.

మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకొని

## హత్యా యత్నం కేసులో ఒకరి అరెస్టు

**సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త :** మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకొని అమె భర్తను చంపే ప్రయత్నం చేసిన కేసులో నిందితుడిని మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్ సిఐ ఉపేందర్ తెలిపారు. ఆయన అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. టూటౌన్ పోలీసుస్టేషన్ పరిధిలోని గుండ్లచెరువు గ్రామానికి చెందిన ఓ మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకొని అమె భర్తను చంపడానికి ప్రణాళిక వేసిన నిందితుడు మెర్గు శ్రవణ్(21)ను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. పరారిలో ఉన్న నిందితులను త్వరలో పట్టుకుంటామని చెప్పారు.

## నమ్మించి మోసం చేసిన వ్యక్తులపై కేసు నమోదు

**సిర్గాపూర్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:** రోడ్డు బిట్టు అంటూ నమ్మబలికి రోడ్డు సౌకర్యం లేని భూమిని రిజిస్ట్రేషన్ చేయించిన వ్యక్తులపై కేసు నమోదు అయిన సంఘటనకు సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌కు చెందిన రాధాకృష్ణ మండల పరిధిలోని వాంగ్దల్ గ్రామ శివారులో సర్వే నంబర్ 41/ఎలో 3.30 గంటుల భూమిని పట్టాదారు బానోత్ లక్ష్మణ్, మధ్యదళారి ప్రేమ్‌సింగ్ రోడ్డు పక్కన భూమి ఉందని తక్కువ ధరఖు వస్తుందని నమ్మబలికి 51 లక్షల రూపాయలకు రాధాకృష్ణ, అతని సోదరి పేర్లపై రిజిస్ట్రేషన్ చేయించారు. కొనుగోలు చేసిన భూమిని వద్దకు రాధాకృష్ణ వెళ్లగా అసలు పట్టాదారు అక్కడికి చేరుకుని తన భూమిని ఎవరికి అమ్మలేదని తెలుపడంతో తను మోసం పోయినట్లు గుర్తించి ఇరువురిపై ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



పెద్దగట్టు పాల్గొన్న నీలం మధుముదిరాజ్ తదితరులు

## జాతరలు తెలంగాణ సాంస్కృతిక వారధులు

### కాంగ్రెస్ నాయకులు నీలం మధు ముదిరాజ్

**పటాన్‌చెరు, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:** ఉమ్మడి నల్గొండ జిల్లా సూర్యాపేట నియోజకవర్గం దురాజ్‌పల్లిలోజరిగే తెలంగాణ రెండవ పెద్ద జాతరైన పెద్దగట్టు(గొల్లగట్టు) లింగమంతుల స్వామిని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ మంగళవారం స్థానిక నాయకులతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులు నీలంకు ఘన స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. అనంతరం నీలం మధు మాట్లాడుతూ.. తెలంగాణలో నిర్వహించే జాతరలు సంస్కృతి సాంప్రదాయాలకు వారధి అన్నారు. తెలంగాణలోని రెండవ అతిపెద్ద జాతరైన పెద్దగట్టు (గొల్లగట్టు) లింగమంతుల స్వామి యాదవుల ఆరాధ్య దైవం అన్నారు. డిల్లెం బల్లెం శబ్దాలతో ఓ లింగ నామస్మరణతో తమ వారంతా బాగుండాలంటూ మొక్కులు తీర్చుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు డాక్టర్ రామ్మూర్తి యాదవ్, ఎంఈపిఎ రాష్ట్ర అధ్యక్షులు పులి దేవేందర్, తుంగతుర్తి నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు రమేష్, ఎంఈపిఎ జిల్లా అధ్యక్షులు కోల కరుణాకర్, అశోక్, లింగన్న, ప్రసాద్, నరేష్, మహేష్, మనోహర్, వినయ్, కోటి, వికాస్, ఉత్సవ నిర్వహకులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎక్స్‌రే డిఫ్రాక్షన్ పై గీతంలో సదస్సు

**పటాన్ చెరు,ఫిబ్రవరి 18,ప్రభాతవార్త:** గీతం స్కూల్ ఆఫ్ సైన్స్‌లోని భౌతిక, రసాయన శాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో పదార్థాల నిర్మాణ విశ్లేషణ కోసం ఎక్స్ రే డిఫ్రాక్షన్‌పై మూడు రోజుల జాతీయ సదస్సును మార్చి 26 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించనున్నారు. పదార్థాల నిర్మాణ విశ్లేషణలో ఒక మూలస్తంభమైన ఎక్స్ రే డిఫ్రాక్షన్ పద్ధతులలో లోతైన జ్ఞానం, ఆచరణాత్మక నైపుణ్యాలను ఇందులో పాల్గొనేవారికి అందించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. వర్క్‌షాపులో నిపుణుల నేతృత్వంలో ఉపన్యాస కార్యక్రమాలు ఉంటాయి. ఇవి ఎక్స్ రే డిఫ్రాక్షన్ యొక్క ప్రాథమిక భౌతిక శాస్త్రం, నిర్మాణ విశ్లేషణలో ఉపయోగించే వివిధ డిఫ్రాక్టోమీటర్ జ్యామితిని పరిశీలిస్తాయి. ఈ అంతర్దృష్టి చర్చలు ఆచరణాత్మక శిక్షణా సెషన్ లతో కూడి ఉంటాయి. ఇందులో పాల్గొనేవారు ఆరిజిన్, ఎక్స్ఆర్డీ విశ్లేషణ ప్యాకేజీలతో సహా పరిశ్రమప్రామాణిక సాఫ్ట్ వేర్ ను ఉపయోగించి అధునాతన విశ్లేషణ పద్ధతులు, స్ట్రక్చరల్ రిఫైన్ మెంట్ సాధనాలు, డేటా ఇంటర్ ప్రెటేషన్ పద్ధతులను అన్వేషిస్తారు. ఈ కార్యశాలలో పాల్గొనేవారు ముఖాముఖి చర్చల ద్వారా ప్రయోజనం పొందడమేగాక, భావనలను స్పష్టం చేయడానికి, సవాళ్లను పరిష్కరించడానికి,వారి విశ్లేషణాత్మక నైపుణ్యాలను మెరుగుపరచుకోవడానికి ఉపకరిస్తుంది. ఐఐటీ హైదరాబాద్ లోని మెటీరియల్స్ సైన్స్ అండ్ మెటలర్జికల్ ఇంజనీరింగ్ (ఎంఎస్ఎంఈ) విభాగానికి చెందిన నిపుణుడు ప్రొఫెసర్ రంజిత్ రామదురల్ ఈ కార్యశాలలో ప్రధాన వక్తగా, శిక్షకుడిగా వ్యవహరిస్తారు. మెటీరియల్స్ సైన్స్, భౌతిక, రసాయన శాస్త్రాలు, సంబంధిత విభాగాలలోని అధ్యాపకులు, పీహెచ్ డీ పరిశోధనా స్కాలర్లకు ఈ కార్యశాల సమగ్ర అభ్యాస అనుభవాన్ని అందిస్తుంది. ఇందులో పాల్గొన్న వారు ఎక్స్ఆర్డీ డేటా సముపార్జన, వివరణలో ప్రాథమిక జ్ఞానం, ఆచరణాత్మక నైపుణ్యాలను పొందవచ్చు. ఆసక్తి ఉన్నవారు మార్చి 24వ తేదీలోగా తమ పేర్లను నమోదు చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ ఫీజు,ఇతర వివరాల కోసం 986 078 2128ను సంప్రదించగలరు.

## మాందాపూర్ పాఠశాలలో స్వయం పాలన దినోత్సవం



స్వయం పాలనలో పాల్గొన్న విద్యార్థులు

**చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 18,ప్రభాతవార్త:** మండల పరిధి తుర్కల మాందాపూర్‌లోని ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులు స్వయంపాలన దినోత్సవాన్ని జరుపుకున్నారు.జిల్లా విద్యాధికారిగా దస్తగిరి, మండల విద్యాధికారిగా నిరోషా, ప్రధానోపాధ్యాయులుగా నవనీత, మిగతా విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు ఫణీంద్ర మాట్లాడుతూ విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్ది, సమాజానికి ప్రయోజకులుగా చేసేది ఉపాధ్యాయులే అని అన్నారు. ఉపాధ్యాయులు అశోక్,శోభరాణి, శ్రీనివాస్,శ్రీహరి, గీత,శ్రీజలు పాల్గొన్నారు.

## జ్యోతి ఇరుముడితో బయలుదేరిన శివ స్వాములు

**శివ్వంపేట, ఫిబ్రవరి 18 (ప్రభాతవార్త) :** శివ స్వాములు భక్తి శ్రద్ధలతో మాల ధరించి ఉదయం, సాయంత్రం పూజలు నిర్వహించి 41 రోజు దీక్ష పూర్తి చేసుకొని వీరప్ప గురుస్వామి, కొడకంచి గణేష్ గౌడ్ గురుస్వాముల ఆధ్వర్యంలో జ్యోతి ఇరుముడి కట్టుకొని మంగళవారం బయలుదేరారు. ఈ సందర్భంగా గురు స్వాములు మాట్లాడుతూ శివ దీక్ష తీసుకొని 41 రోజులు ఉదయం సాయంత్రం ఎంతో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి మండల దీక్ష పూర్తి చేసుకొని శివ్వంపేట సన్నిధానంలో ఇరుముడి కట్టుకొని శ్రీశైలం మల్లికార్జున స్వామికి సమర్పిస్తామని శివయ్య ఆశీస్సులతో ప్రజలందరూ అందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నామని గురు స్వాములు అన్నారు. అనంతరం స్వాములకు, భక్తులకు ఇసుగారి రాజయ్య గోనెమ్మ దంపతులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సన్నిధానం స్వాములు కుమార్ స్వామి, మల్లేష్ స్వామి, నర్సింలు స్వామి, వెంకటస్వామి, దేవేందర్ గౌడ్ స్వామి, కాశి స్వామి, అనిల్ స్వామి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవు ఎస్ఐ

**సిర్గాపూర్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:** మద్యంతాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు. మంగళవారం సాయంత్రం మండల పరిధిలోని శివాజీ చౌక్ వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. ఆటుగా వచ్చిన వాహనాలను తనిఖీ చేసి వాహనాల చోదకులకు బ్రీత్ ఎనాలసిస్ చేశారు. మద్యం సేవించిన ముగ్గురిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశామన్నారు మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలు ఊసలు లెక్కబెట్టడం తధ్యమని హెచ్చరించారు.

## ఘనంగా భాగ్యరెడ్డివర్మ వర్ధంతి

**గజ్వేల్ టౌన్, ఫిబ్రవరి 18 (ప్రభాతవార్త):** పట్టణంలోని అంబేద్కర్ భవన్‌లో మంగళవారం భాగ్యరెడ్డివర్మ 86వ వర్ధంతిని డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డిబిఎఫ్ నియోజకవర్గ నాయకులు మాసన్‌పల్లి మైసయ్య, శ్రావణ్, లింగం, శేఖర్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## అంజిరెడ్డి తల్లి బాలమ్మ మృతి

### అంత్యక్రియల్లో పాల్గొన్న సుప్రీం కోర్టు మాజీ జడ్జి సుభాష్‌రెడ్డి

**చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 18,ప్రభాతవార్త:**

మండల పరిధి కామారం గ్రామానికి చెందిన, చిన్నశంకరంపేట సొసైటీ చైర్మన్ అంజిరెడ్డి తల్లి బాలమ్మ సోమవారం సాయంత్రం అనారోగ్యంతో మృతి చెందారు. విష యం తెలుసుకున్న సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి సుభాష్‌రెడ్డి, మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి, అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధికి మహర్దశ : మండల అధ్యక్షులు హరినాథ్‌రెడ్డి



సిసి రోడ్డు పనులను ప్రారంభిస్తున్న అధికారులు

**కొత్తూర్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త :** గ్రామాల అభివృద్ధికి మహర్దశ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు హరినాథ్‌రెడ్డి అన్నారు. కొత్తూర్ మండలంలోని కోడిచెర్ల గ్రామంలో ఎమ్మెల్యే నిధులు రూ.10 లక్షలతో సిసిరోడ్డు పనులను ప్రారం భించారు. ఈకార్యక్రమానికి పార్టీ మండల అధ్యక్షులు హరినాథ్‌రెడ్డి పాల్గొని సిసిరోడ్డు పనులను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.... ఎమ్మెల్యే వీర్లపల్లిశంకర్ కొత్తూర్ మండలానికి చేస్తున్న అభివృద్ధి పనులు ప్రజలు ఎప్పటికి మరువలేనిదన్నారు. తను ఎమ్మెల్యే గెలిచిన కొద్ది రోజుల్లోనే అభివృద్ధి ఎలా ఉంటుందో ప్రతి ఒక్కరికి అర్థం అయ్యేలా పనులు చేస్తూ ప్రజలకు అన్ని విధాలుగా సహాయ సహకారం అందిస్తున్నారన్నారు. అందులో భాగంగానే గ్రామంలో పది లక్షల రూపాయాలతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎల్లారం శేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు మల్లికార్జున్‌రెడ్డి, సెక్రటరీ రాఘ వేందర్‌రెడ్డి, బాల్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ యాదయ్య, చంద్‌ారెడ్డి, మాజీ వార్డు సభ్యులు నవీన్, కృష్ణ, శ్రీధర్, శ్రీకాంత్, సాయి రెడ్డి, మహిపాల్‌రెడ్డి, సంతోష్‌కుమార్ ఉన్నారు.

## ఎఐవైఎఫ్ సమావేశాలను జయప్రదం చేయాలి





ఘట్‌కేసర్‌లో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏఐవైఎఫ్ నాయకుల

**ఘట్‌కేసర్, ఫిబ్రవరి18, ప్రభాతవార్త:** కేంద్ర, రాష్ట్ర ప్రభుతా ్వలు అవలంబిస్తున్న యువజన విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరి ధర్మేంద్ర, మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి.సత్యప్రసాద్‌లు పిలుపునిచ్చారు. ఘట్‌కేసర్ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం ఆవరణలో మంగళవారం అఖిల భారత యువజన సమాఖ్య రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలకు సంబంధించిన గోడపత్రికను ఘట్‌కేసర్ మండల సమితి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. మార్చి 1, 2 తేదీలలో మేడ్చల్ జిల్లా ఈసీఐఎల్ ఏఐవైఎఫ్ రా ష్ట్ర కౌన్సిల్ సమావేశాలు జరుగుతాయని యువత అధిక సంఖ్యలో హాజరు కావాలని సూచించారు.? ఈకార్యక్రమంలో ఏఐవైఎఫ్ ఘట్‌కేసర్ మండల కార్యదర్శి సంపంగి శివ, సహాయకార్యదర్శివెంకటేశ్వర్లు,యేసు బాబు, సంపత్, పరమేశ్ పాల్గొన్నారు.

## గురుకుల్ విద్యాలయాన్ని అభివృద్ధిచేయాలి



సచివాలయంలో రాష్ట్ర మంత్రి ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

**ఘట్‌కేసర్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ పట్టణంలోని గురుకుల్ విద్యాసంస్థను అభివృద్ధి పరిచేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర బీసీ రవాణా, బీసీ సంక్షేమశాఖల మంత్రికి వినతి పత్రం అందజేశారు. ఘట్‌కేసర్‌మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరియాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం గురుకుల్ పూర్వవిద్యార్థులు సచివాలయంలో మంత్రి పొన్నంనుకలిసివినతిపత్రంఅందజేశారు. గురుకుల్‌ను కాపాడుకుందాం నినాదంతో చేపట్టిన ఉత్తరాల ఉద్యమం 20వ రోజుకు చేరుకోగా మంత్రిని కలిసి గురుకుల్ పరిస్థితిని వివరించి అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. కంది ప్రేమ్‌కుమార్, ఎస్‌డి.అహ్మద్, ప్రసన్న, నందరాజ్‌లు ఉన్నారు.

## ఆరోగ్య సేవలను సమర్థవంతంగా అమలు చేయాలి



డిఎంఅండ్‌హెచ్ఓ కార్యాలయంలో వైద్య అధికారులతో సమీక్షించిన డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ సి.ఉమాగౌరి,పాల్గొన్న అధికారుల దృశ్యం

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:**ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు ఆరోగ్య సేవలను మరింత సమర్ధవంతంగ అమలు చేయాలని వైద్యాధికారులను మేడ్చల్ జిల్లా డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ సి.ఉమాగౌరి స్పష్టం చేశారు. మంగళవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని డిఎంఅండ్‌హెచ్ఓ కార్యాలయంలో కీసర, మల్కాజ్‌గిరి డివిజన్స్ డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్ఓల, ఆరోగ్యకేంద్రాల వైద్యాధికారులతో ఆమె సమీక్షించారు. జిల్లాలో ప్రజలకు అందుతున్న ఆరోగ్యసేవలు, సంక్షేమ పథకాల అమలు, సౌకర్యాలు, వసతలు, వాటి పనితీరు పలు అంశాలపై ఆమె వైద్యాధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగ డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ సి.ఉమాగౌరి మాట్లాడుతూ ప్రభుత్వాలు అందించే ఆరోగ్య సంబంధిత పథకాలను పకడ్బంధీగ అమలు చేయాలన్నారు. ప్రజలకు మరింత చేరువయ్యేలా అవసరమైన సూచనలు, సలహాలు డాక్టర్ ఉమాగౌరి అందించారు. ఈ సమీక్షా సమావేశంలో డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్ఓలు, పలు ఆరోగ్యకేంద్రాల మెడికల్ ఆఫీసర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## రంగులు వేస్తుండగా వ్యక్తికి విద్యుత్ షాక్

**చౌడపూర్ ఫిబ్రవరి 18 ప్రభాతవార్త :**

వికారాబాద్ జిల్లా చౌడపూర్ మండల కేంద్రంలో ఓ ఇంటికి డాబా పైనుంచి పొడవాటి బ్రష్ తో రంగులు వేస్తుండగా విద్యుత్ వైర్లు తగిలి షాక్ గురై కింద పడిన సంఘటన జరిగింది.. వివరాల్లోకి వెళ్తే జీవనోపాధి కొరకు ఆగిర్యాల గ్రామం కొందుర్గు మండలానికి చెందిన ఆంజనేయులు,, కాంట్రాక్టర్ ద్వారా పెయింట్ పని చేస్తుంటాడు... మంగళవారం దురదృష్టవశాత్తు షాక్ కు రావడంతో కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలు అయ్యాయి. మహబూబ్‌నగర్ ఆసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్సల కోసం హైదరాబాద్ లోని ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం బాధితుడి ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్లు సమాచారం.

## శివుడు అర్థమైతే సత్యం అర్థమవుతుంది



పడిపూజలో పాల్గొన్న శివస్వాములు, జర్నలిస్టుకెపి

**షాద్‌నగర్, ప్రభాతవార్త, ఫిబ్రవరి 18 :** గుణ,రూప,గంధ, స్పర్శాత్మకమైన సమస్తమూ రుద్రుని సృష్టి అని బ్రహ్మాదులందరు అమృత రూపుడిగా ఆరాధించే ఆ పరమేశ్వరుడు అచలుడు, ఆనందమూర్తి, ఆదిత్య వర్ణుడుక, సర్వాధిపతి, తిమిరాతీతుడు, సర్వుడు అని శివుడు అర్థమైతే సత్యం అర్థమవుతుందని శివ గురుస్వామి కమ్మరి భూపాల చారి అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలం ఉప్పరిగడ్డ గ్రామంలో శివ పడిపూజ అంగరంగ వైభవంగా జరిగింది. గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు తిక్కన్న, యువ నాయకుడు జి.గోపాల్ రెడ్డి, శ్రీకాంత్ తదితరుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి సీనియర్ జర్నలిస్టు కేపీ హాజరయ్యారు. ఈ సందర్భంగా గురుస్వామి కమ్మరి భూపాలచారి మాట్లాడుతూ పరమేశ్వరుని కన్నా పెద్ద గానీ చిన్న గానీ సాటి గానీ ఎవరూ లేరని, సర్వప్రాణుల యందు అణువణువునందు నిండిన స్వయం ప్రకాశక సదానందమూర్తి అని, మోక్షార్థి అయినవాడు ఆశ్రయించదగ్గ ఏకైక విరాడ్రూపుడు ఆ పరమేశ్వరుడొక్కడే అని అన్నారు. శివతత్వం జిజ్ఞాసువులకు సైతం అందినట్టే అంది అగోచరమయ్యేల మహా మూర్తిమంతమైన తత్వం ఆయనదని, అట్టి శివతత్వం అర్థమయితే సత్యం అర్థమవుతుందని అన్నారు. ఈ సందర్భంగా పన్నెండు మెట్ల పూజ నిర్వహించిభజనలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన శివస్వాములు పడి పూజలో పాల్గొని శివనామస్మరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఈర్ల యాదయ్య, తిరుపతయ్య, శ్రీను, రాజు, రమేష్, ఎం.రమేష్, మల్లయ్య, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధిని ఓర్వలేక ఆరోపణలు

**ఆమనగల్లు, ఫిబ్రవరి13, ప్రభాతవార్త:** అధికారానికి దూరమైన కల్వకుంట్ల కుటుంబం కాంగ్రెస్ ప్రభుత్వం సాధిస్తున్న రాష్ట్ర ప్రగతిని చూసి జీర్ణించుకోలేకనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని లక్ష్యంగా చేసుకుని అర్థరహిత ఆరోపణలు చేస్తుందని టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. పదేళ్ళ బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ రాష్ట్రం పూర్తిగా ధ్వంసం అయిందని, కేసీఆర్ అసమర్థపాలనలో మిగులు రాష్ట్రం అప్పులు రాష్ట్రంలుగా మారిపోయిందని విమర్శించారు. ఆమనగల్లు పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ నిర్వహించిన రైతునిరసనదీక్షపై కాంగ్రెస్ పార్టీ తరపున మండల పార్టీ అధ్యక్షుడు తెల్గమళ్ల జగన్ అధ్యక్షతన పార్టీ శ్రేణులు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నర్సింహ్మా, గూడూరు శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ విమర్శలు చేశారు. రైతుపేరిట నిర్వహిస్తున్న నిరసనదీక్ష పూర్తిగా కేటీఆర్‌ది దొంగ దీక్షగా అభివర్ణించారు. మంగళవారం మార్కెట్ యార్డు కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయిళ్ళ శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ కేసీఆర్ చేతిలో పూర్తిగా నష్టపోయిన తెలంగాణ రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తిరిగి గాడిలో పెట్టేందుకు నిరంతరం కృషి చేస్తున్నాడన్నారు. బీఆర్ఎస్ పాలనలో లక్ష రుణమాఫీని కూడా చేయలేక రైతులను మోసం చేసిందన్నారు. సర్పంచుల బిల్లులను ఉద్దేశపూర్వకంగా ఆపి ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంపై అపవాదు రుద్దడానికి కుట్రలకు పన్నాగం పన్నుతుందని ఆరోపించారు. బీఆర్ఎస్ పాలనలో రైతుభరోసా పేరిట అనర్హులకు డబ్బులు అందజేసిన విషయాన్ని ప్రజలు ఛీత్కరిస్తున్నారన్న విషయాన్ని బీఆర్ఎస్ పార్టీ గుర్తుంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బిచ్యనాయక్, వస్పుల మానయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వస్పుల శ్రీశైలం, చేగూరి వెంకటేశ్, ధనంజయ్య, ఖలీల్, అప్పం శ్రీను, శివలింగం, హలీమ్, ఖాదర్, కరీం, ఎంగలి ప్రసాద్, ఖాదర్‌ఖాద్రి, అనితవిజయ్, కాలె మల్లయ్య, పాండురంగయ్య, ఫరీద్, సురేష్‌నాయక్, నాజర్, విజయ్‌రాథోడ్, మెకానిక్‌బాబా, శేఖర్‌గౌడ్, ఉన్నారు.

## దేవాలయ ఆర్చిని ప్రారంభించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



ఆర్చిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి

**షాద్‌నగర్, ప్రభాతవార్త, ఫిబ్రవరి 18 :** ఫరూఖ్‌నగర్ మండలం రాయికల్ గ్రామంలో ఎల్లమ్మ తల్లి దేవాలయం ముందు దూసకల్ గ్రామానికి చెందిన నక్కల స్వరూప సత్యనారాయణ గౌడ్ తన కుమారుడు నక్కల విక్రమాదిత్య గౌడ్ జ్ఞాపకార్థం నిర్మించిన కమాన్ (ఆర్చి)ని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్,మాజీఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డిలు మంగళవారం ప్రారంభించారు. ఈసందర్భంగావారు దేవాలయంలో ప్రత్యేకపూజలుచేశారు. ఈకార్య క్రమంలో మాజీ జడ్పీటీసీ శ్యాంసుందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు అగ్గనూరు బస్వం, చెంది తిరుపతి రెడ్డి, బాల్‌రాజ్ గౌడ్, గ్రామస్థులు వెంకట్ రెడ్డి, బక్కన్నయాదవ్, ఆశన్నగౌడ్, రాములు గౌడ్, రాయికల్ శ్రీనివాస్, వేణుగౌడ్, మోహన్ రెడ్డి, ఖదీర్, తుపాకుల శేఖర్, కృష్ణ, చంటి, శ్రీనివాస్ గౌడ్, సుభాష్ గౌడ్, నీల రవీందర్ గౌడ్, మల్లేష్ గౌడ్ పాల్గొన్నారు.

## టియుడబ్ల్యుజె జిల్లా యూనియన్ డైరీని ఆవిష్కరణ



టియుడబ్ల్యుజె జిల్లా యూనియన్ డైరీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

**మేడ్చల్, ఫిబ్రవరి 18. ప్రభాతవార్త :** టియుడబ్ల్యుజె మేడ్చల్ జిల్లా డైరీని యూనియన్ నాయకులతో కలిసి మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. బోయిన్‌పల్లిలోని ఎమ్మెల్యే నివాసానికి యూనియన్ నాయకులు తరలివెళ్లి ఆయన చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు గడ్డమీది బాలరాజు, కార్యదర్శి వెంకట్‌రాంరెడ్డి, దాడుల నిరోధక రాష్ట్ర కమిటి సభ్యుడు హరినాథ్, జిల్లా నాయకులు రాములు, ప్రసాద్, మల్కాజ్‌గిరి ప్రధాన కార్యదర్శి మధుసూధన్‌రెడ్డి, జర్నలిస్టులు శేషారెడ్డి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## రూ.15 లక్షలతో లింగాలకుంటకు సిసిరోడ్డు నిర్మాణం



సిసి రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ మాజీ ప్రజాప్రతినిధులు

**ఘట్‌కేసర్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మున్సిపల్ లింగాలకుంట రోడ్డులో చేపట్టిన సిమెంట్‌రోడ్డు నిర్మాణ పనులను ఘట్‌కేసర్ మున్సిపల్ మాజీ ప్రజాప్రతినిధులు పరిశీలించారు. మున్సిపల్ నుంచి రూ.15 లక్షల నిధులు కేటాయించడంతో లింగాలకుంట శ్రీనాగలింగేశ్వరస్వామి దేవాలయానికి వెళ్లే రోడ్డులో సిసి రోడ్డు నిర్మాణం చేస్తున్నారు. ఈనెల 26న మహాశివరాత్రి ఉండటంతో భక్తుల సౌకర్యార్థం సిసి రోడ్డు వేసి అందుబాటులోకి తేవడానికి యుద్ధప్రాతిపదికన అధికారులు పనులు చేయిస్తున్నారు. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్, మాజీవైస్ చైర్మన్ పలుగుల మాధవరెడ్డి తదితరులు రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించి నాణ్యత పాటించి పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈకార్యక్రమంలో కీసరగుట్ట డైరెక్టర్ సగ్గు అనిత, మాజీ కౌన్సిలర్లు బండారి అంజనేయులు, కొమ్మిడి అనురాధ, కుతాడి రవీందర్, మాజీ కోఆప్షన్ సభ్యులు ఎస్‌కె.శౌకత్‌మియా, వర్క్ ఇన్‌స్పెక్టర్ మారుతీ, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు మామిండ్ల ముత్యాలుయాదవ్, ఉపాధ్యక్షులు కొరుబోతు నాగరాజు, డిసిసి కార్యదర్శి ఉల్లి అంజనేయులు, బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు పైళ్ల అండాలు, నాయకులు మొత్కుపల్లి శ్రీనివాస్, ఎం.అబ్దుల్‌ఖయ్యూమ్, నర్సింగ్‌రావు, రాజారత్నం తదితరులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శిగా నర్రగిరి

**శంషాబాద్. ఫిబ్రవరి 18. ప్రభాతవార్త :** భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శిగా శంషాబాద్ పట్టణానికి చెందిన నర్రగిరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం విడుదల చేసిన పత్రిక ప్రకటనలో నర్రగిరి తెలిపారు. రంగారెడ్డి జిల్లా నాలుగో మహాసభలు జూబ్లీహిల్స్ లోటస్ పాండ్ లోనీ రావి నారాయణరెడ్డి హాలులో ఫిబ్రవరి 16న జరిగాయి . ఏఐటీయూసీ జిల్లా రాష్ట్ర నాయకత్వం ధర గిరిని జిల్లా కార్యదర్శిగా ఎంపిక చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. రంగారెడ్డి జిల్లా కార్యదర్శిగా ఎన్నిక చేసినందుకు రాష్ట్ర జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## కొనసాగుతున్న ఉత్తరాల ఉద్యమం

**ఘట్‌కేసర్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:** గురుకుల్‌కు పూర్వవైభవం తీసుకువచ్చేందుకు చేపట్టిన ఉత్తరాల ఉద్యమం కొనసాగుతున్నది. గురుకుల్‌ను అభివృద్ధి చేయాలని సంకల్పంతో పూర్వవిద్యార్థులు సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు గత 20 రోజులుగా ఉత్తరాలు, వినతిపత్రాలను అందిస్తున్నారు. మంగళవారం ఘట్‌కేసర్ మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరియాదవ్ ఆధ్వర్యంలో మాజీ ఆర్థిక, సాగునీటి పారుదలశాఖల మంత్రి-సిద్దిపేట శాసనసభ్యులు తన్నీరు హరీష్‌రావును ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. గురుకుల్ విద్యాసంస్థలో 27 ఎకరాల స్థలం ఉందని పరిరక్షించి అభివృద్ధి కోసం కృషి చేయాలని కోరారు. ప్రేమ్‌కుమార్, ప్రసన్న, అహ్మద్, నందరాజ్‌లు ఉన్నారు.

# తిరుమల కాలనీ ప్రహరీ గోడలుతొలగించాలి

### ప్రహరీగోడలపై హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు
### దళితవాడల నుంచి ప్రజలు వెళ్లకుండ
### ప్రహరీ ఏర్పాటుపై దళితుల ఆందోళన





తిరుమల కాలనీ వారు ప్రహరీగోడ ఏర్పాటు చేశారని ఆందోళన వ్యక్తం చేసిన నాయకుల దృశ్యం

**శామీర్‌పేట, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:**

దేవరయాంజాల్‌లోని దళితవాడల ప్రజలు రాకపోకలు నిర్వహించకుండ తిరుమలకాలనీ వారు ప్రహరీగోడలు నిర్మించారని ఆ ప్రహరీగోడలను తొలగించాలని హైడ్రా కమిషనర్‌కు స్థానిక దళిత సమాఖ్య నాయకులు ఫిర్యాదు చేశారు.మంగళవారం శామీర్‌పేట మండలం తూంకుంట మున్సిపాల్టీ పరిధిలోని 13వ వార్డులో ఉన్న దళితవాడ ప్రజలు రాకపోకలు జరగకుండ తిరుమల కాలనీ చుట్టూ ప్రహరీగోడ నిర్మించారని, పూర్వం నుంచి దళితవాడ నుంచి దళితులు రాకపోకలు నిర్వహించటానికి దారి ఉండేదని ఆ ప్రహరీగోడలను రోడ్లకు ఉన్న వాటిని తొలగించాలని హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు దళిత సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు బిఎన్.రాంమోహన్ తెలిపారు. అయితే హైడ్రా అధికారులబృందం విచ్చేసిరెండుచోట్ల మాత్రం ప్రహరీని కూల్చివేశారని,కాలనీవాసులు అడ్డుకోవటంతో మిగతా ఆరు చోట్ల కూల్చకుండ అధికారులు వెళ్లారని ఆ ఆరు చోట్ల రోడ్లకు అడ్డుకా ఉన్న ప్రహరీగోడలను కూల్చివేయాలని ఆయనతో పాటు పలువురు దళితసమాఖ్య నాయకులు డిమాండ్ చేస్తూ కాలనీ వద్ద వారు ఆందోళన వ్యక్తం చేశారు.

గ్రామపంచాయతీ లేఅవుట్ అని కొన్నేళ్ల కిందట వెంచర్ జరిగినట్లు పలు సార్లు కూడ మండల తహసీల్దార్‌కు, మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదులు చేశామని, స్పందన లేకపోవటంతో హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

హైడ్రా అధికారుల బృందం వారు వచ్చి రెండు చోట్ల మాత్రమే ప్రహరీని కూల్చారని, మిగతా ఆరు చోట్ల రోడ్లకు వెళ్లకుండ ఉన్న ప్రహరీలను కూల్చాలని హైడ్రా అధికారులను కోరుతున్నట్లు బిఎన్.రాంమోహన్ పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం దళితవాడ ప్రజలు తిరుమలకాలనీ నుంచి రాకపోకలు నిర్వహించటానికి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. ఇకనైనా సంబంధిత హైడ్రా అధికారులు పూర్తి స్థాయిలో దళితవాడల ప్రజలకు రాకపోకలు నిర్వహించటానికి తగు చర్యలు తీసుకోవాలని హైడ్రా అధికారులను కోరుతున్నట్లు రాంమోహన్‌తో పాటు పలువురు నాయకులు పేర్కొన్నారు.

## అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు

**శంకర్‌పల్లి,ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:** అర్హులైన లబ్ధిదారులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అవుతాయని శంకర్‌పల్లి మండల అభివృద్ధి అధికారి వెంకయ్యగౌడ్ అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యా లయంలో ఇందిరమ్మ ఇండ్లపై ఎర్వగూడ గ్రామస్థులతో అవగాహన సద స్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఏపీపీ ద్వారానే ఆన్లైన్లో జరుగుతాయన్నారు.

## ప్రభుత్వ పాఠశాల గోడపై కెసిఆర్ చిత్రాలే

**బషీరాబాద్,ఫిబ్రవరి18,ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి సంవత్సరం గడుస్తున్నా ప్రభుత్వ పాఠశాలలో మాజీసిఎం కెసిఆర్ చిత్రాలు దర్శనమిచ్చిన సంఘటన బషీరాబాద్ మండలం మైల్వార్ గ్రామం ప్రాథమిక పాఠశాల గోడలపై కొలువుతీరాయి. ఇంతకాలం తర్వాత గమనించిన కాంగ్రెస్‌నాయకులు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయటంతో, సమాచారం అందుకున్న బషీరాబాద్ తహశీల్దార్ వై.వెంకటేష్ మంగళవారం మైల్వార్ గ్రామానికి వెళ్లి మాజీ ముఖ్యమంత్రి చిత్రాలపై పెయింట్ వేయించారు.


ప్రజలతో మాట్లాడుతున్న ఎస్సై నీరేష్

### ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా

## ప్రజలు సహకరించాలి : ఎస్ఐ నీరేష్

**చేర్యాల, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త :** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు సహకరించాలని ఎస్సై నీరేష్ ప్రజలకు సూచించారు. మంగళవారం మండలంలోని చిట్యాల, దానంపల్లి గ్రామాలను ఆయన సందర్శించి ప్రజలతో మాట్లాడారు. ఎన్నికలు వస్తుంటాయి పోతుంటాయి కాని గ్రామంలో అందరూ ఒకే చోట ఉంటారు కాని వాటిని అడ్డుపెట్టుకుని గొడవలకు దిగొద్దన్నారు. ఎన్నికలు శాంతియుత వాతావరణంలో నిర్వహించడానికి అందరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్నికలు అడ్డుపెట్టుకుని గొడవలు సృష్టించొద్దు

### మద్దూరు ఎస్సై షేక్ మహబూబ్


మాట్లాడుతున్న ఎస్సై షేక్ మహబూబ్

**ధూళిమిట్ట, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త :** త్వరలో నిర్వహించబోయే స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా సహకరించాలని మద్దూరు ఎస్సై షేక్‌మహబూబ్ ప్రజలకు సూచించారు. మంగళవారం మండలంలోని రెడ్యానాయక్ తండాను ఎస్సై సందర్శించి ప్రజలతో మాట్లాడారు. ఎన్నికలను అడ్డుపెట్టుకుని గ్రామాల్లో గొడవలు సృష్టించొద్దని తెలిపారు. శాంతియుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడానికి గ్రామస్థులు సహకరించాలని కోరారు. అలాగే యువత మత్తు పదర్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎవరైన చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడిన, గ్రామాల్లో ఎవరైన అనుమానంగా కనిపించిన సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం


పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న దృశ్యం

**కొమురవెల్లి, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త :** మండల పరిధిలోని మర్రి ముత్యాల గ్రామంలో 2002-23 సంవత్సరం విద్యార్థులు సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. చిన్ననాటి స్నేహితులను కలవడానికి పలువురు పూర్వ విద్యార్థులు బెంగళూరు నుంచి ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేసిన 12 మంది ఉపాధ్యాయులను ఘనంగా సత్కారించారు. కార్యక్రమంలో దేవ్‌కుమార్, ప్రభంజన్, శ్రీనివాస్, శోభన్‌చారి, బ్రహ్మచారి. నరేందర్, పవన్‌కుమార్, భాస్కర్, పవన్, శ్రీరాములు, శ్రీనివాస్, నరేందర్, భానుచందర్, సరిత రేణుక, మంజుల, లలిత, లక్ష్మి, సంధ్య, లక్ష్మి, శ్రీదేవి, అనిత, శోభ తదితరులు పాల్గొన్నారు.

## తపాస్‌పల్లి రిజర్వాయర్ నింపి రైతులను ఆదుకోవాలి


బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

**కొమురవెల్లి, ఫిబ్రవరి 18,ప్రభాతవార్త :** చేర్యాల,కొమురవెల్లి, మద్దూరు, దూళ్‌మిట్ట మండలాల పరిధిలోఉన్న 53 గ్రామాల 133 చెరువులు కుంటలను తపాస్‌పల్లి రిజర్వాయర్ ద్వారా నీటిని నింపి రైతులను ఆదుకోవాలని సిపిఎం ఆధ్వర్యంలో కొమురవెల్లి నుంచి తపాస్‌పల్లి రిజర్వాయర్ వరకు మంగళవారం బైక్‌ర్యాలీ నిర్వహించారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు శెట్టిపల్లి సత్తిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించి చెరువులు, కుంటలు నింపి రైతులను ఆదుకోవాలన్నారు. సాగునీరు అందకపోవడంతో పంటలు ఎండిపోయే పరిస్థితికి వచ్చిందని రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. రైతులకు సాగునీరు అందించడంలో ఏమాత్రం నిర్లక్ష్యం చేసిన ఆందోళనలు చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కొంగరి వెంకట్, అలేటి యాదగిరి, బండకింది అరుణ్‌కుమార్, తాడూరి రవీందర్, బద్దిపడగా కృష్ణరెడ్డి, దాసరి ప్రశాంత్, అత్తిని శారద, షఫీ, రాళ్లబండి నాగరాజు, శోభ బక్కిలి బాలకిషన్, తేలు ఇస్తారి, స్వర్గం శ్రీకాంత్, అరుట్ల రవీందర్, బాలస్వామి, బాలరాజు,సురేందర్, రాజు తదతరులు పాల్గొన్నారు.

## కళాశాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

### -మాజీ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి

**గజ్వేల్, ఫిబ్రవరి 18 (ప్రభాతవార్త):** గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్) ఆధ్వర్యంలో మంగళవారం కళాశాల ప్రణాళిక అభివృద్ధి కార్య వర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ డాక్టర్ నిక్కత్ అంజుమ్ 2024-25 విద్యా సంవత్సరానికి గానూ కళాశాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కళాశాలకు సంబంధించిన పలు రకాల అభివృద్ధి కార్యక్రమాల్లో పాలుపంచుకొని అందులో వారి సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. సిపిటిసి సభ్యులు వంటేరు గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ రానున్న విద్యా సంవత్సరంలో కళాశాల అడ్మిషన్లు పెరగడానికి కళాశాల వర్గం కృషి చేయాలన్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ రాజమౌళి కళాశాలకు మౌలిక వసతులకు కావాల్సిన అవసరాలను ప్రభుత్వానికి సిఫారసు చేస్తామన్నారు. కళాశాల సిపిడిసి సభ్యుడు నరేష్ మాట్లాడుతూ కళాశాలకు సౌండ్ సిస్టం అందిస్తామన్నారు. ఇతర సభ్యులు డాక్టర్ లక్ష్మణ్, శ్రీధర్ ల్యాబ్‌లను సందర్శించి తగిన ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ప్రిన్సిపాల్ ముఖ్యఅతిథులను శాలువాతో సన్మానించారు.



కళాశాల ప్రణాళిక అభివృద్ధి సమావేశంలో పాల్గొన్న రాజమౌళి

# కందుల కొనుగోలుపై కేంద్రం ఆంక్షలు విధించడం సరికాదు

### మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి


మాట్లాడుతున్న మార్కెట్ చైర్మన్ తిరుపతిరెడ్డి

**హుస్నాబాద్ రూరల్, ఫిబ్రవరి 18,ప్రభాతవార్త**

కందుల కొనుగోళ్ల విషయంలో కేంద్ర ప్రభుత్వం ఆంక్షలు విధించడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి అన్నారు. మంగళవారం మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మార్కెట్ కమిటీలలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో జరుగుతున్న కందుల కొనుగోళ్లలో కేంద్ర ప్రభుత్వ జీవో ప్రకారం ఎకరాకు 3 క్వింటాళ్ల 30 కిలోలు మాత్రమే కొనుగోలుచేయాలని ఉందని, కానీ వాస్తవానికి రైతులు ఒక ఎకరాకు ఐదు నుండి ఏడు క్వింటాళ్ల వరకు పంటను పండిస్తారన్నారని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం వల్ల రైతులు పండించిన పంటను మద్దతు ధరకు అమ్ముకోలేకపోతున్నారన్నారు. ఈ విషయంలో స్థానిక శాసనసభ్యులు, రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కేంద్రానికి లేఖ రాసారని,మార్కెట్ కమిటీ తరుపున తాము సైతం జిల్లా కలెక్టర్‌కు విన్నవించామని చెప్పారు. కందుల కొనుగోలు విషయంలో కరీంనగర్ ఎంపి, కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ స్పందించి మార్క్‌ఫెడ్ ద్వార ఎకరాకు 7 క్వింటాళ్ల కొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇక ఆన్‌లైన్‌లో పంటలు నమోదు చేసుకోని రైతులు పంటను అమ్ముకునేందుకు ఆందోళన చెందవద్దని మార్కెట్లో వారికి తాత్కాలికంగా రిజిస్ట్రేషన్ చేసి కొనుగోలు చేస్తామని వివరించారు. సమావేశంలో సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బంక చందు, డైరెక్టర్లు తనుకు ఆంజనేయులు, తేరాల మారుతి, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య

## ఇంటిపన్ను, నల్లా బిల్లులు సకాలంలో చెల్లించాలి

### -మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య

**గజ్వేల్, ఫిబ్రవరి 18 (ప్రభాతవార్త):** ఇంటి పన్ను, నల్లా బిల్లు, ట్రేడ్ లైసెన్స్ సంబంధించిన పన్నులపై మంగళవారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కార్యాలయంలో వార్డు అధికారులు, బిల్ కలెక్టర్లతో మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటిపన్ను, నల్లాబిల్లు, ట్రేడ్ లైసెన్స్ పన్నులను వసూలు చేయాలని తెలిపారు. అదేవిధంగా ఇంటి నెంబర్ లేని గృహాలు, వాణిజ్య సముదాయాలకు ఇదివరకే ఇంటి నెంబర్ తీసుకోవాలని తెలియజేయడం జరిగిందని, నేటినుండి వారం రోజుల్లోపు ఇంటినెంబర్ లేని గృహాలు, వాణిజ్య సముదాయాలు తప్పనిసరిగా నెంబర్ తీసుకోవాలని లేనిచో చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ఇంటి పన్ను, నల్లా బిల్లు, ట్రేడ్ లైసెన్స్ పన్నులు చెల్లించి పట్టణ అభివృద్ధికి తోడ్పడాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ, వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## మాసాయిపేటలో బిజెపి ఎన్నికల ప్రచారం


ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న గోదావరి అంజిరెడ్డి, వాల్దాస్ మల్లేష్ గౌడ్

**వెల్దుర్తి, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:** మాసాయిపేట్ మండల కేంద్రంలో మంగళవారం మాసాయిపేట మండల అధ్యక్షులు పాపన్నగారి వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటి ప్రచారం చేయడం జరిగింది. ఎమ్మెల్సీ ఓటర్లను కలిసి బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి తరపున వారి సతీమణి గోదావరి అంజిరెడ్డి, బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు, మెదక్ జిల్లా బీజేపీ అధ్యక్షులు వాల్దాస్ మల్లేష్ గౌడ్ ప్రచారంలో పాల్గొన్నారు. బీజేపీ అభ్యర్థులు భారీ మెజార్టీతో గెలుస్తారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పాపన్నగారి వేణుగోపాల్, మండల ప్రధాన కార్యదర్శి సాయితేజ, మండల ఉపాధ్యక్షులు నవీన్ యాదవ్, బూత్ కమిటీ అధ్యక్షులు రాములు తదితరులు పాల్గొన్నారు.

## బిజెపితోనే అభివృద్ధి సాధ్యం

### ఒబిసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేష్‌గౌడ్

**నర్సాపూర్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త :** దేశ అభివృద్ధి బిజెపితోనే సాధ్యమవుతుందని ఆ పార్టీ ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాపగారి రమేష్‌గౌడ్ అన్నారు. మంగళవారం నర్సాపూర్ మండల పరిధిలోని చిన్న చింతకుంట, పెద్దచింతకుంట గ్రామాలలో పట్టబద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ మేరకు బిజెపి పార్టీ తరపున పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజి రెడ్డి గారికి మద్దతుగా ప్రచారం చేయడం జరిగింది. ఈ సందర్భంగా బిజెపి ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పాప గారి రమేష్ గౌడ్ మాట్లాడుతూ విద్యావంతులైన పట్టబద్రులుఅందరూ బిజెపి పార్టీ పట్టబద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజి రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఓబిసి రాష్ట్రఉపాధ్యక్షులు పాప గారి రమేష్ గౌడ్ తోపాటు బిజెపి నాయకులు బోర్ వెల్ రామ్ రెడ్డి, గుండం శంకర్, నర్సాపూర్ మండల అధ్యక్షులు నీలి నగేష్, మండల ప్రధాన కార్యదర్శి నగేష్ గౌడ్, మండల ఉపాధ్యక్షుడు బాలరాజు, బూత్ అధ్యక్షులు నవీన్, లక్ష్మీనారాయణ, బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.


ఎన్నికల ప్రచారం చేస్తున్న రమేష్‌గౌడ్ తదితరులు


మాటాడుతున్న అత్తు

## కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే రాష్ట్రం సుభిక్షం

### పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు

**సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త :** ఒకసారి ఓటమి మూడుసార్ల బిఆర్ఎస్ గెలుపుకు నాంది పలుకుతుందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు మాట్లాడం విడ్డూరంగా ఉందని మూడు జన్మలెత్తిన బిఆర్ఎస్ అధికారంలోకి రాదని సిద్దిపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎం.డి.ఇమామ్(అత్తు) అన్నారు. సిద్దిపేట పట్టణంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.ప్రజలకు ఎన్ని మాయ మాటలు చెప్పిన బిఆర్ఎస్‌ను నమ్మె పరిస్థితుల్లో లేరని పేర్కొన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్ ఇంటికే పరిమితం కావడం ఖాయమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందన్నారు. మిగులు బడ్జెట్‌తో ఉన్న రాష్ట్రాన్ని బిఆర్ఎస్ 10 యేండ్ల పాలనలో అప్పులు పాలు చేసిన విషయాన్ని ప్రజలు మరిచిపోరాని తెలిపారు. బిజెపిని గెలిపించడానికి బిఆర్ఎస్ చీకటి ఒప్పందం చేసుకొని ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయడం లేదన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన ఆరు గ్యారెంటీలను దశల వారిగా అమలు చేస్తూ ముందుకు సాగుతుంటే బిఆర్ఎస్ నాయకులు జీర్ణించుకోలేక తొండి వ్యాఖ్యాలు చేస్తున్నారని మండిపడ్డారు. సమావేశంలో నాయకులు గ్యాదరి మధు, గయాజుద్దీన్, సలీం, అనిల్, రాహుల్ పాల్గొన్నారు.

## వీవోఏల రివ్యూ మీటింగ్‌లో పాల్గొన్న డీఆర్‌డీవో


మాట్లాడుతున్న డీఆర్‌డీవో శ్రీనివాసరావు

**వెల్దుర్తి, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని మండల సమైక్య కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన వీవోఏల రివ్యూ మీటింగ్‌కు డీఆర్ డీవో శ్రీనివాసరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు లింకేజీ టార్గెట్ అచీవ్‌మెంట్ 130 శాతం చేయాలని, బ్యాంకు లింకేజీ ఎన్‌పీఏను 0.5 శాతానికి తగ్గించాలని సూచించడం జరిగింది. అదే విధంగా స్త్రీ నిధి టార్గెట్ అచీవ్‌మెంట్ 130 శాతం చేయాలని, స్త్రీ నిధి ఎన్‌పీఏను 0.5 శాతానికి తగ్గించాలని సూచించడం జరిగింది. అదేవిధంగా ప్రతి మహిళ ఒక్కొక్క మొక్క నాటాలని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్త్రీ నిధి ఆర్ఎం గంగారాం, ఏపీఎం శంకరయ్య, సీసీలు సత్యం, యాదగిరి, కిషన్, రజిత, స్త్రీ నిధి ఏఎం కరుణాకర్, వివోఏలు పాల్గొన్నారు.

### 20 నుంచి 25 వరకు బివి రాజు కళాశాలలో పోటీలు

**నర్సాపూర్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త :** పట్టణ సమీపంలోని బివి రాజు ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 20 నుంచి 25వ తేదీ వరకు ఈ బహ సే ఇండియా పోటీలు జరగనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సంజయ్ దుబె మంగళవారం అన్నారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సౌత్ ఇండియాలోనే రెండవసారి ఈ పోటీలను బివిఆర్ఐటి కళాశాలలో నిర్వహించడం జరుగుతుందన్నారు. పోటీలో దేశవ్యాప్తంగా ఉన్న ఐఐటీ, ఎన్ఐటీ ఇతర ప్రముఖ విశ్వవిద్యాలయాల నుంచి 82 జట్లతో 2,500 పైగా ఇంజినీరింగ్ విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. ఈ ఈవెంట్ అంతర్జాతీయ ఆటోమోటివ్ రంగంలో వేగంగా మారుతున్న దృక్పథాన్ని అర్థం చేసుకోవడానికి, సృజనాత్మకత, టీమ్‌వర్క్‌ను ప్రోత్సహిస్తుంది అన్నారు. ఈ ఈవెంట్‌లో గ్లోబల్ ఆటోమోటివ్ దిగ్గజాలు వోల్వో, డైమ్లర్, ఏవీఎల్, అల్టైర్, టాటా మోటార్స్, మహీంద్రా తదితర ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయని పేర్కొంటు యువ ఇంజినీర్లకు తమ కెరీర్‌ను ప్రారంభించడానికి అత్యుత్తమ అవకాశమని అన్నారు. ఈ పోటీలకు కళాశాల ఆవరణలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దశరథ్, డాక్టర్ కే రాయుడు, డాక్టర్ మల్లికార్జున్ తదితరులు ఉన్నారు


మాట్లాడుతున్న సంజయ్ దూబే

# ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార సభను విజయవంతం చేయండి

### మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి


మాట్లాడుతున్న వంటేరు నరేందర్‌రెడ్డి

**గజ్వేల్, ఫిబ్రవరి 18 (ప్రభాతవార్త):**

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార సభను విజయవంతం చేయాలని గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం గజ్వేల్ పట్టణంలో మాట్లాడుతూ నేడు జరగబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారసభ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని పిఎన్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కార్యకర్తలు, పట్టభద్రులు పెద్దఎత్తున సమావేశానికి హాజరుకావాలని పేర్కొన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డితో పాటు ఎమ్మెల్సీ ఎన్నికల ఇంచార్జ్, అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ, కో-ఆర్డినేటర్ గుత్తా అమిత్‌రెడ్డి, మెదక్ పార్లమెంట్ ఇంచార్జ్ నీలం మధుముదిరాజ్ హాజరవుతున్నట్లు తెలిపారు. సభకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్, గుంటుకు శ్రీను, ఊడెం శ్రీనివాస్‌రెడ్డి, సమీర్,గాడిపల్లి శ్రీను, జంగం రమేష్‌గౌడ్, డప్పు గణేష్, దయ్యాల యాదగిరి, బాలగౌడ్, శ్రావణ్, మహేష్, కొడకండ్ల బాలు తదితరులు పాల్గొన్నారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

**చిన్నకోడూరు, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త :** మండల పరిధిలోని అల్లీపూర్ గ్రామానికి చెందిన పులి పుష్పలత సుమన్ దంపతుల కుమార్తె పులి శ్రీనిధికి గుండె అపరేషన్ కావడం వలన కుటుంబానికి సిద్దిపేట నియోజకవర్గానికి చెందిన పూజల హరికృష్ణ ఆదేశాల మేరకు సిఎం సహాయ నిధి రూ.22 వేలు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం సహాయ నిధి పేదలకు ఎంతో మేలు చేస్తుందన్నారు. సిఎం సహాయ నిధికి సహకరించిన రాజానర్సింహకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కొలిమి బిక్షపతి, సందబోయిన పర్శరాం, పాకాల భూపతిరెడ్డి, నక్క రాజు,పెంబర్ల మల్లేశం, మల్కా మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

**అక్కన్నపేట, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:** మండలంలోని గౌరవెల్లి గ్రామ పంచాయతీ కార్మికుడు తాడూరి నర్సయ్య అనారోగ్యంతో మృతి చెందగా విషయం తెలుసుకున్న గ్రామస్థులు కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించేందుకు రూ.7,700 బైరగోని ప్రశాంత్,పొంద్రాల మోహన్‌ల ఆధ్వర్యంలో మంగళవారం వారి కుటుంబానికి అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నర్సయ్య గ్రామ పంచాయతీ కార్మికుడిగా గ్రామానికి ఎంతో సేవ చేశాడని గుర్తు చేశారు.ఆయన సేవలను గుర్తించిన గ్రామస్థులు కొంత మంది ద్వార ఈ సహాయాన్ని వారి కుటుంబ సభ్యులకు అందజేయడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో కొమ్ముల పర్శయ్య ఉన్నారు.

## రైతులు మేలురకం వంగడాలు ఎంచుకోవాలి : ఏవో

**జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 18 (ప్రభాతవార్త):** రైతులు పంటలు సాగు చేసేటప్పుడు మేలురకం విత్తనాలను ఎంచుకోవాలని మండల వ్యవసాయాధికారి య.వసంతరావు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని అలిరాజపేట గ్రామంలో రైతు రవీందర్‌రెడ్డి సాగుచేసిన ఎన్‌బిఈజీ-47, జెజి-11 శనగ పంట క్షేత్రాలను ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన శనగ పంట వంగడాలు రైతులకు బాగా ఉపయోగపడతాయని, ఈ రకం విత్తనాలు నిటారుగా పెరగడమే కాకుండా కాయ పైకి కాయడం వల్ల మిషన్‌లతో హార్వెస్టింగ్ చేసుకోవడానికి అనువుగా ఉంటుందని, అంతేకాకుండా ఎండు తెగులును సమర్థవంతంగా తట్టుకొని ఎనిమిది నుంచి పది క్వింటాళ్ల దిగుబడి వస్తుందన్నారు. జెజి-11 శనగ రకంతో పోల్చితే ఎన్‌బిఈజీ-47 శనగరకం అధిక దిగుబడి ఇస్తుందని, గింజ బరువు అధికంగా ఉంటుందని అన్నారు. అనంతరం గ్రామంలో ఏనుగుల శ్రీనివాస్‌రెడ్డి సాగుచేసిన దనియాల పంటను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తోర్నాల ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు జె.విజయ్, కో-ఆర్డినేటర్ పల్లవి, ఏఈఓ కవిత, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో రాణించాలి

### మాజీ ఎంపిపి పాండుగౌడ్

**మర్కుక్, ఫిబ్రవరి 18 (ప్రభాతవార్త):** గ్రామీణ క్రీడాకారులు జిల్లా, రాష్ట్ర స్థాయిలో రాణించాలని వారికి మావంతు సహాయ సహకారాలు అందిస్తామని మాజీ ఎంపిపి పాండుగౌడ్, మాజీ జెడ్‌పిటిసి మంగమ్మ రాంచంద్రం, మాజీ వైస్ ఎంపిపి బాల్‌రెడ్డి, బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డిలు తెలిపారు. మండల పరిధిలోని దామరకుంట గ్రామంలో గత పది రోజులుగా ఏకలవ్య కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణయాదవ్ ఆధ్వర్యంలో అండర్-16 కబడ్డీ క్రీడాకారులకు శిక్షణ ఇస్తున్నారు. ఈ సందర్భంగా మంగళవారం క్రీడా శిక్షణను సందర్శించిన మాజీ ప్రజాప్రతినిధులు ఏకలవ్య కబడ్డీ అసోసియేషన్‌కు భోజన ఖర్చులతో పాటు క్రీడాకారులకు దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో ఎంతోమంది క్రీడాకారులు ఉన్నప్పటికీ సరైన సమాచారం, ప్రోత్సాహం లేకపోవడంతో జిల్లా, రాష్ట్ర స్థాయికి వెళ్లలేకపోతున్నారని, అలాంటి క్రీడాకారులకు ఎల్లప్పుడూ మావంతు సహాయ సహకారాలు ఉంటాయని పేర్కొన్నారు. యువకులు చెడు మార్గంలో కాకుండా మంచి మార్గంలో ఉంటూ ఒక్కొక్కరి నైపుణ్యాన్ని బట్టి వారు ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గాయత్రి బాల్‌నర్సయ్య, ఏఎంసి మాజీ డైరెక్టర్ పత్తి బాబు, మాజీ ఉపసర్పంచ్ ఆంజనేయులు, నాయకులు కనకరాజు, సంతోష్, కోచ్ నరేందర్, క్రీడాకారులు పాల్గొన్నారు.

## భూ బాధితులకు పరిహారం పెంచి అందించాలి


హద్నూర్‌లో నిమ్జ్ భూబాధితులతో సమావేశం అయిన అధికారులు

**న్యాల్‌కల్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:** నిమ్జ్ భూబాధితులతో మంగళవారం నిమ్జ్ అధికారులు సమావేశం అయ్యారు. మండలంలోని హద్నూర్, గుంజోటి గ్రామాల రైతులతో అదికారులు సమావేశం కాగా నిమ్జ్‌లో భూములు కోల్పోతున్న భూమికి అందిస్తున్న పరిహారం సరిపోదని, భూమికి సరిపడే పరిహారం అందించాలని అధికారులకు రైతులు సూచించారు. నిమ్జ్‌లో ఏర్పాటు చేసే కర్మాగారాల్లో ఉపాధి కల్పించాలని రైతులు సూచించారు. కార్యక్రమంలో నిమ్జ్ డిప్యూటీ కలెక్టర్ రాజు, డిప్యూటీ తహసీల్దార్ రాజిరెడ్డి, పంచాయితీ కార్యదర్శి ధన్‌రాజ్,రైతులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**పాపన్నపేట, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:** మిన్పూర్ 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని కుర్తివాడ,యూసుఫ్‌పేట్, మిన్పూర్ గ్రామాల్లో బుధవారం విద్యుత్ సరపరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నర్సింలు పేర్కొన్నారు. వేసవి కాలంలో ఎలాంటి సమస్యలు ఉత్పనం కాకుండా ముందస్తుగా అవసరమైన మరమ్మత్తులు చేయిస్తున్నందున ఉదయం 11.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, అందుకు వినియోగదారులు విద్యుత్ అధికారులకు తమ వంతు సహకారం అందించాలని ఏఈ నర్సింలు సూచించారు.

## వెల్దుర్తిలో బిజెపి ఎన్నికల ప్రచారం


ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

**వెల్దుర్తి, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు అంగడిపేట శ్రీనివాస్ గౌడ్, మాజీ మండల అధ్యక్షుడు బాలకిషన్, నాగరాజు, శ్రీధర్, విక్రమ్‌ల పట్టభద్ర ఓటర్లను కలిసి బీజేపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజి రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. అలాగే మండల కేంద్రంలో మండల అధ్యక్షులు పడిగె దాసు ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. కార్య క్రమంలో కర్రె వెంకటేశం, కోదండ శేఖర్‌గౌడ్, శివరాములు పాల్గొన్నారు.

## చేతల ప్రభుత్వం కాదు కోతల ప్రభుత్వం

### -ఎఫ్‌డిసి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

**గజ్వేల్, ఫిబ్రవరి 18 (ప్రభాతవార్త):**

కాంగ్రెస్ ప్రభుత్వం చేతల ప్రభుత్వం కాదని కోతల ప్రభుత్వమని మాజీ ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం గజ్వేల్ పట్టణంలోని స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడుస్తున్నా ఏ ఒక్క హామీని పూర్తిగా నెరవేర్చలేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 8,500 సర్వే నెంబర్లను బ్లాక్ లిస్టులో పెట్టి సుమారు 2 లక్షల మంది రైతులకు రైతు భరోసాను ఎగ్గొట్టిందన్నారు. రైతులకు పెట్టుబడి సహాయం బంద్ చేయడం ఏమిటని రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. ప్రభుత్వానికి దమ్ముంటే ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం కళ్లు తెరిచి రైతులకు పూర్తి స్థాయిలో రైతు భరోసా అందించాలని ప్రతాప్‌రెడ్డి డిమాండ్ చేశారు.

